క్రీడలతో మానసికోల్లాసం

మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

గంగాధర, మార్చి 9 : క్రీడలు మానసికోల్లాసాన్ని ఇస్తాయని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ సూచించారు. మండలంలోని ఉప్పరమల్యాల గ్రామంలో కర్ర శ్రీనివాస్ రెడ్డి (వీపార్క్) ఆధ్వర్యంలో నిర్వహించిన యూపీఎల్ సీజన్ 5 క్రికెట్ పోటీల ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్యే విజేతలకు బహుమతులు అందజేశారు. యువత క్రీడల్లో రాణించి రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎంపికకావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆకుల మధుసూదన్, కంకణాల విజేందర్ రెడ్డి, బొల్లాడి శ్రీనివాస్ రెడ్డి, ముక్కెర మల్లేశం, సముద్రాల అజయ్, విజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

బహుమతులు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే రవిశంకర్

అంత్యక్రియలకు వెళ్లొస్తూ.. అనంతలోకాలకు

- కల్వర్టును ఢీకొన్న ద్విచక్రవాహనం
- కెనాల్‌లో పడి యువకుడి మృతి

గొర్రె నరేశ్ (ఫైల్)

మానకొండూర్ రూరల్, మార్చి 9: సమీప బంధువు మృతి చెందగా, అంత్యక్రియలకు వెళ్లి తిరిగివస్తుండగా, ద్విచక్ర వాహనం అదుపుతప్పి కల్వర్టును ఢీకొనడంతో కెనాల్‌లో పడి ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం పచ్చునూర్ గ్రామానికి చెందిన గొర్రె నరేశ్(30) తన తండ్రి వెంకటయ్యతో కలిసి శనివారం కొండపల్కలలో సమీప బంధువు మృతి చెందడంతో అంత్యక్రియల కోసం ద్విచక్రవాహనంపై వెళ్లారు. సాయంత్రం తిరుగు పయనంలో తండ్రితో కలిసి పచ్చునూర్‌కు బయలుదేరాడు. మద్దికుంటకు చేరుకోగానే ఇంటితాళం మర్చిపోవడంతో వెంకటయ్యను మద్దికుంట పెద్దమ్మ గుడి దగ్గర దింపి కొండపల్కలకు వెళ్లాడు. అక్కడ తాళంచెవి దొరకకపోవడంతో నరేశ్ ఇంటికి (తన తండ్రి వద్దకు) బయలుదేరాడు. మద్దికుంట శివారులోని కెనాల్ వద్దకు చేరుకోగానే కల్వర్టును ఢీకొనడంతో ద్విచక్రవాహనంపాటు నరేశ్ కెనాల్ పడిపోగా, తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో వారు నరేశ్‌ను బయటికి తీసి ఆటోలో కరీంనగర్‌కు తీసుకెళ్తుండగా అన్నారం గ్రామానికి చేరుకోగానే 108 వాహనం వచ్చింది. పరీక్షించిన సిబ్బంది అప్పటికే నరేశ్ మృతిచెందినట్లు తెలిపారు. సెంట్రింగ్ పనులు చేస్తూ, తల్లిదండ్రులకు పెద్దదిక్కుగా ఉన్న ఒక్కొక్క కొడుకు మృతి చెందడంతో వారి రోదనలు మిన్నంటాయి. దీంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. నరేశ్‌కు తల్లిదండ్రులు, ఇద్దరు అక్కలు ఉన్నారు. నరేశ్ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని మానకొండూర్ సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

నేడు విద్యుత్ వినియోగదారుల కోర్టు

తిమ్మాపూర్, మార్చి 9 : మండలంలోని నుస్తులాపూర్‌లోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో సోమవారం విద్యుత్ వినియోగదారుల ఫోరం కోర్టు నిర్వహించనున్నట్లు ఫోరం చైర్‌పర్సన్ ఎన్‌వీ వేణుగోపాలాచారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారుల విద్యుత్ పునరుద్ధరణ, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు మార్చడం, వోల్టేజీ హెచ్చుతగ్గుల, డిస్ట్రిబ్యూషన్ సిస్టం పెంపుదల, లోపాలు ఉన్న మీటర్లు మార్చడం, నూతన సర్వీసులు మంజూరు, అనదపు లోడ్ క్రమబద్ధీకరణ, సర్వీస్ పేరు మార్పు, వాడకాన్ని హెచ్చు మొత్తంలోని బిల్లులు, కేటగిరీ మార్పు, సర్వీస్ రద్దు మొదలైన ఎలాంటి సమస్యలు ఉన్నా ఫోరం కోర్టులో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఫిర్యాదు చేసుకోవచ్చని చెప్పారు. ఈ అవకాశాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఫోరం చైర్మన్ కోరారు.

మహిళలు ధైర్యంగా ముందుకెళ్లాలి

- సినీనటి లహరీ షారి
- రెనే దవాఖానలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

విద్యానగర్ : సినీనటి లహరీ షారిని సన్మానిస్తున్న రెనే వైద్య సంస్థల చైర్మన్ డాక్టర్ బంగారి స్వామి-ప్రియదర్శిని దంపతులు

విద్యానగర్, మార్చి 9 : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని స్థానిక రెనే దవాఖానలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిగ్ బాస్ 5 కంటెస్టెంట్ సినీనటి ఎంటర్‌ప్యూనర్, సోషల్ యాక్టివిస్ట్, లహరీషారి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సమాజంలో మహిళలు ఎదుర్కొనే సమస్యలపై సరైన అవగాహన ఉండి దృఢమైన ఆలోచన విధానంతో వాటిని ఎదుర్కోవాలని, జీవితంలో ఎదురయ్యే ప్రతి సమస్యను సానుకూల దృక్పథంతో పరిష్కరించే దిశగా ప్రతి మహిళా ఆలోచించాలన్నారు. ప్రతి చిన్న విషయానికి కృంగిపోకుండా నేను మహిళను నాతో ఏమీ కాదన్న ఆత్మన్యూనతా భావాన్ని విడిచిపెట్టి మహిళా అంటే పురుషుడి కంటే ఎందులోనూ తక్కువ కాదన్న ధైర్యంతో ముందుకు వెళ్లాలని సూచించారు. ఈ సమావేశంలో రజనీ సంతాన సాఫల్య కేంద్రం చైర్మన్, రెనే దవాఖాన మేనేజింగ్ డైరెక్టర్ బంగారి రజిని ప్రియదర్శిని మాట్లాడుతూ, నేటి సమాజంలో స్త్రీలు అన్ని రంగాల్లో దూసుకుపోతున్నారని, ఆరోగ్య పరంగా కూడా స్త్రీలు పురుషుల కంటే ఎంతో మెరుగని కాబట్టి వారు ఎదుర్కొనే సమస్యలకు దీటుగా సమాధానం చెప్పాలని పిలుపునిచ్చారు. రెనే వైద్య సంస్థల అధినేత ప్రొఫెసర్ డాక్టర్ బంగారి స్వామి మాట్లాడుతూ, తమ సంస్థలో పనిచేసే ఉద్యోగుల్లో సింహభాగం మహిళలే ఉన్నారని, వైద్య రంగంలో రోగుల సేవలో స్త్రీల పాత్ర ఎంతో ప్రత్యేకమన్నారు. ఈ రోజు వైద్యరంగంలో వైద్య విద్యార్థుల్లో చాలావరకు స్త్రీలే ముందున్నారన్నారు. వైద్యరంగం అంటేనే నర్సింగ్ అని నర్సింగ్ విభాగం అనేది మహిళలు లేకుండా ఊహించడం అనేది అసాధ్యమన్నారు. రోగుల సేవలలో స్త్రీల పాత్ర తల్లి లాంటిదని వారు కొనియాడారు. హాస్పిటల్లో వివిధ విభాగాల్లో సేవలందిస్తున్న మహిళా ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. ఈ మహిళా దినోత్సవంలో మెడికల్ సూపరింటెండెంట్ రవీంద్రా చారి, డీన్, సీనియర్ అనస్థిషియా వైద్య నిపుణుడు మునిష్,

కొత్తపల్లి : మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న వింధ్యావాలీ ఉపాధ్యాయులు

వైద్యులు కృష్ణారెడ్డి, లతీష్ రెడ్డి, గుండె వైద్య నిపుణుడు దినకర్ తాటిమట్ల, సీనియర్ ఫిజీషియన్ నిఖిల్ లక్ష్మణ్, నాన్ క్లినికల్ డైరెక్టర్ అరవింద్ రావు, జనరల్ మేనేజర్ పవన్ ప్రసాద్, బయో మెడికల్ ఇంజినీర్ రతన్, దవాఖాన మేనేజర్ ప్రఫుల్, నర్సింగ్ సూపరింటెండెంట్ సంప్రితి, సిబ్బంది పాల్గొన్నారు.

వింధ్యావాలిలో..

కొత్తపల్లి, మార్చి 9 : స్థానిక మెహర్‌గర్‌లోని వింధ్యావాలీ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా ఆదివారం మహిళా ఉపాధ్యాయులకు వివిధ క్రీడా పోటీలను నిర్వహించారు. పోటీలను పాఠశాల చైర్మన్ రామవరం లక్ష్మీ ప్రకాశ్‌రావు ఉపాధ్యాయులతో కలిసి కేక్‌కట్ చేసి, ప్రారంభించారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తుండడం అభినందనీయమన్నారు. నిత్యం వ్యాయామం, శారీరక శ్రమ చేస్తూ మహిళలు ఆరోగ్యంగా ఉండాలన్నారు. కుటుంబ శ్రేయస్సు, సమాజాభివృద్ధి మహిళల చేతుల్లోనే ఉంటుందన్నారు. అనంతరం మహిళా ఉపాధ్యాయులకు లెమన్ అండ్ స్పూన్, రన్నింగ్ రేస్, మ్యూజికల్ చైర్, బుక్ బ్యాలెన్సింగ్ తదితర క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించి, బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వైస్ చైర్మన్ రామవరం పృథ్వీరావు, ప్రిన్సిపాల్ జీ ప్రశాంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సప్తగిరి ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో..

కమాన్‌చౌరస్తా, మార్చి 9 : జిల్లా కేంద్రంలోని సప్తగిరి కాలనీ సప్తగిరి ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం విద్యార్థుల తల్లిదండ్రుల ప్రత్యేక ఆటల పోటీలు ఏర్పాటు చేశారు. ఇక్కడ పాఠశాల చైర్మన్ మందల నాగేశ్ రెడ్డి, ప్రిన్సిపాల్ అనితా రెడ్డి, మోటివేటర్ పల్లె శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కమాన్‌చౌరస్తాలో..

గ్రాడ్యుయేషన్ డేలో పట్టాలు పొందిన విద్యార్థులు, అతిథులు

అద్వితలో అలరించిన గ్రాడ్యుయేషన్ డే

కమాన్‌చౌరస్తా, మార్చి 9 : అద్విత ఇంటర్నేషనల్ పాఠశాలలో ఆదివారం సాయంత్రం ప్రీప్రైమరీ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే వేడుకలు మెటామార్ఫోసిస్ 2024-25 పేరిట అట్టహాసంగా నిర్వహించగా, అహుతులను ఎంతో అలరించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ వైద్యురాలు అడేపు శైలజ హాజరై మాట్లాడారు. ఇక్కడ విద్యాసంస్థల డైరెక్టర్ అనుదీప్ సొగని, ప్రిన్సిపాల్ మాధురి శ్వేత విద్యార్థులకు పలు సూచనలు ఇచ్చారు.

సబ్ స్టేషన్ మరమ్మతులు

ముకరంపుర, మార్చి 9: నగరంలోని టౌన్-3, టౌన్-5 సెక్షన్లలోని సబ్ స్టేషన్లలో సరఫరాకు ఇబ్బంది లేకుండా ఆదివారం మెయింటనెన్స్ పనులు చేపట్టారు. గతంలో సబ్ స్టేషన్‌లో మరమ్మతులు పూర్తయ్యే వరకు ఆ సబ్‌స్టేషన్ పరిధిలోని కాలనీలకు సరఫరా నిలిపేయాల్సి వచ్చేది. ఈ నేపథ్యంలో సమీప సబ్ స్టేషన్ నుంచి ప్రత్యామ్నాయ లైన్ల ద్వారా ఆయా సబ్ స్టేషన్ల పరిధిలోని వినియోగదారులకు విద్యుత్‌ను సరఫరా చేస్తూనే ఆదివారం మరమ్మతులు పూర్తి చేశారు. పనులను మేక రమేశ్‌బాబు, డీఈ జంపాల రాజం పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో టౌన్-1 ఏడీఈ పంజాల శ్రీనివాస్ గౌడ్, ఏఈలు గుణుకుల వెంకట రమణయ్య, నజియ జబీన్, సిబ్బంది పాల్గొన్నారు.

అలరించిన వార్షికోత్సవం

కొత్తపల్లి, మార్చి 9 : కరీంనగర్ ఇంగ్లిషు మీడియం పాఠశాల, కిడ్స్ కేర్ సెంటర్ వార్షికోత్సవం ఆదివారం రాత్రి నగర శివారులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఘనంగా నిర్వహించారు. సంస్కృతి దీపోత్సవం పేరుతో 19వ వార్షికోత్సవం డాక్టర్ అశోక్‌కుమార్ రేఖ, సిద్దిపేటకు చెందిన వనవిహారి ట్రస్ట్ చైర్మన్ ఎస్ఎస్ వై ఆచార్య ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారులు చేసిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పాఠశాల నిర్వాహకుడు జక్కుల బుచ్చయ్య, పాఠశాల కరస్పాండెంట్ జక్కుల గిరిబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నృత్యం చేస్తున్న చిన్నారులు

ఊరిస్తూ.. ఊదరగొడుతూ..

- అంగన్‌వాడీ ఖాళీల భర్తీకి ఈ సారైనా మోక్షం లభించేనా..?
- నోటిఫికేషన్ కోసం ఎదురుచూపులు

కలెక్టరేట్, మార్చి 9 : అంగన్‌వాడీ కేంద్రాల్లోని ఖాళీల భర్తీపై తమ ప్రభుత్వం దృష్టి పెట్టింది. దీని కోసం అవసరమైన సన్నాహాలు చేస్తున్నాం. అందుకోసమే ఖాళీల ప్రకటన విడుదల చేస్తున్నామంటూ మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ ఇటీవల ఓ సమావేశంలో ప్రకటించింది. ఎన్నికల కోడ్ ముగియగానే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వేలాది ఖాళీ పోస్టులు ఒకేసారి భర్తీ చేయబోతున్నామంటూ వెల్లడించింది. దీంతో అంగన్‌వాడీ కేంద్రాల్లో విధులు నిర్వర్తిస్తున్న ఆయాలతో పాటు, నిరుద్యోగ మహిళల్లో కూడా పెద్ద ఎత్తున ఆశలు మొదలయ్యాయి. నేటితో ఎన్నికల కోడ్ ముగియనుండగా, నోటిఫికేషన్ విడుదల కోసం ఆశావహులంతా ఎదురుచూస్తున్నారు. అయితే, ఇందుకు సంబంధించిన సన్నాహాలు చేయడంలో అధికారులు చడిచప్పుడు చేయడం లేదని తెలుస్తుండగా, నోటిఫికేషన్ విడుదలపై అందరిలో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రిక్రూట్‌మెంట్ అంశంలో గతంలో మాదిరి కాకుండా ఈ సారి కేంద్రం కొత్త నిబంధనలు తెచ్చింది. విద్యార్హతల పెంపుతో పాటు నిర్దిష్ట వయసు వారు మాత్రమే దరఖాస్తు చేసుకునేలా వివిధాలు పాటించాలంటూ ప్రకటించింది. ఇంటర్మీడియట్ విద్యార్హతతో పాటు, 18 నుంచి 35 ఏళ్లలోపు వయసు ఉన్న మహిళలు మాత్రమే దరఖాస్తులు చేసుకునే అవకాశం కల్పించింది. వారికి అవసరమైన రాతపరీక్షలు నిర్వహించిన వచ్చిన మార్కుల ఆధారంగా ఎంపిక చేపట్టేలా ఆదేశాలు కూడా జారీ చేసింది. వీటిని పరిగణలోకి తీసుకుని, క్షేత్రస్థాయిలో అమలు చేసేందుకు అవసరమైన గైడ్‌లైన్స్ రూపొందించి జిల్లాలకు పంపాలి. కానీ, ఇప్పటివరకు ఆ దిశగా చర్యలు చేపట్టలేదని సమాచారం. జిల్లాల్లో కూడా కలెక్టర్ అధ్వర్యంలో ఎంపిక కమిటీలు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. గతంలో ఎస్ఎస్సీ ఉత్తీర్ణత అర్హతతోనే నియామకాలు చేపట్టగా, తాజాగా కేంద్రం విడుదల చేసిన కొత్త మార్గదర్శకాలు అనుసరించాల్సి ఉంటుంది. ఇప్పటివరకు జిల్లాలకు కూడా మార్గదర్శకాల అమలుపై ఎలాంటి సమాచారం లేదని తెలుస్తోంది. దీంతో నోటిఫికేషన్ విడుదల ప్రకటన గతంలో మాదిరిగా ఈ సారి కూడా ఊరించి.. ఊదరగొట్టినట్లే అవుతుందా? అనే అనుమానాలు ఆశావహుల నుంచి వ్యక్తమవుతున్నాయి. ఖాళీల భర్తీ ప్రక్రియ ప్రారంభిస్తే మాత్రం ఉమ్మడి జిల్లాలోని 2,135 కేంద్రాల్లో కాళీగా ఉన్న 235 టీచర్ పోస్టులు, 899 ఆయాల పోస్టులు పూరించే అవకాశాలున్నాయి. కరీంనగర్ జిల్లాలోని 777 కేంద్రాల్లో ఖాళీగా ఉన్న 69 టీచర్, 202 ఆయా పోస్టులు భర్తీ చేయడానికి ఆస్కారం ఉటుందనే అభిప్రాయం ఆ శాఖ వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి.

చిన్నారులకు బోధిస్తున్న అంగన్‌వాడీ టీచర్

ప్రజా సంక్షేమమే లక్ష్యం : ఎమ్మెల్యే


బస్సులో ప్రయాణిస్తున్న ఎమ్మెల్యే సత్యం

గంగాధర, మార్చి 9 : ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తానని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. కరీంనగర్ డిపో నుంచి మండలంలోని కురిక్యాల మీదుగా గర్శకుర్తి, బోయినపల్లి మండలం మర్లపేట, వేములవాడ వరకు గతంలో ఆర్టీసీ బస్సులు నడిచేవని, ఆ తర్వాత నిపేశారన్నారు. కాగా, ఆయా గ్రామాల ప్రజల కోరిక మేరకు ఆర్టీసీ అధికారులతో మాట్లాడి ఆదివారం బస్సును తిరిగి ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

సైదాపూర్, మార్చి 9 : మండలంలోని వెన్నంపల్లి జడ్పీహెచ్ఎస్‌లో 2001-02 ఎస్ఎస్సీ బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ముందుగా విద్యాబుద్ధులు చెప్పిన ఉపాధ్యాయులను ఘనంగా శాలువాతో సన్మానించారు. ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

మూడు ట్రాక్టర్లు సీజ్..

కథలాపూర్, మార్చి 9 : చింతకుంట గ్రామశివారులో అటవీశాఖకు చెందిన భూములను చదును చేస్తున్న మూడు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు కథలాపూర్ సెక్షన్ అధికారి ఎండీ ముస్తాక్ అలీ ఆదివారం తెలిపారు. శనివారం రాత్రి అక్రమంగా మూడు ట్రాక్టర్లతో అటవీభూములను చదును చేయగా, అటవీశాఖ సిబ్బందికి కనిపించిందన్నారు. మూడు ట్రాక్టర్లను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. తనిఖీల్లో బీట్ ఆఫీసర్లు సాయిరాం, శివరాజ్ పాల్గొన్నారు.

మహాసభకు తరలిన పద్మశాలీలు

మహాసభకు బయలుదేరిన పద్మశాలీలు

చిగురుమామిడి, మార్చి 9 : అఖిల భారత పద్మశాలీ సంఘం, తెలంగాణ ప్రాంత పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఆదివారం నిర్వహించిన మహాసభకు మండలంలోని పలు గ్రామాల్లో తరలివెళ్లారు. మండల పద్మశాలీ సంఘం అధ్యక్షుడు వంగర మల్లేశం, ప్రధాన కార్యదర్శి మంచి కట్ల కనకయ్య ఆధ్వర్యంలో అన్ని గ్రామాల నుంచి వాహనాల్లో మహాసభకు తరలి వెళ్లారు. పద్మశాలీలు రాజకీయంగా, సామాజికంగా చైతన్యవంతం కావడం కోసం ఈ మహాసభఆఆను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మహాసభను విజయవంతం చేసిన మండల ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మహాసభకు మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన పద్మశాలీ తరలి వెళ్లారు.

నేడు నుంచి నల్లగొండ జాతర ప్రారంభం

తిమ్మాపూర్, మార్చి 9 : నల్లగొండ సీతారామ లక్ష్మీనర్సింహస్వామి జాతర సోమవారం నుంచి ప్రారంభంకానున్నాయి. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తుల కోసం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆలయ కమిటీ చైర్మన్ బండారుపల్లి లక్ష్మణ్ కోరారు.

వీణవంకలో నూతన కమిటీతో జిల్లా అధ్యక్షుడు నరేశ్

మండల కమిటీ ఎన్నిక

వీణవంక, మార్చి 9 : ధర్మసమాజ్ పార్టీ నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నిక చేసినట్లు జిల్లా అధ్యక్షుడు తాళ్ల నరేశ్ తెలిపారు. మండలాధ్యక్షుడిగా మహంకాళి రమేశ్, ఉపాధ్యక్షుడిగా గడ్డం శ్రీనివాస్ యాదవ్, ప్రధానకార్యదర్శులుగా అంబాల కిరణ్, బొంగోని తిరుపతిగౌడ్, కార్యదర్శులుగా దరిపెల్లి నరేశ్, అంబాల చింతన్, కోశాధికారిగా గాజుల కుమార్, కార్యవర్గ సభ్యులుగా వినయ్, మహేశ్, అనిల్, వినోద్, చందు, రాజు, లక్ష్మణ్, హరీశ్, కుమార్, ఆంజనేయులును ఏకగ్రీవంగా ఎన్నిక చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ జిల్లా అధ్యక్షుడు తాళ్ల మహేశ్ మాట్లాడుతూ, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ధర్మసమాజ్ పార్టీ పోటీ చేస్తుందని తెలిపారు. మండల వ్యాప్తంగా పార్టీ బలోపేతం ఎళ్లవేళలా కృషి చేస్తానని మండలాధ్యక్షుడు రమేశ్ అన్నారు.

జాతీయవాద ప్రభావం కీలకం

కమాన్‌చౌరస్తా, మార్చి 9 : సోషల్ మీడియాలో జాతీయవాద ప్రభావం కీలకంగా మారిందని ప్రముఖ యూట్యూబర్, జర్నలిస్ట్ నవత దేశ్ పాండే పేర్కొన్నారు. సమాచార భారతి కల్చరల్ అసోసియేషన్ కరీంనగర్ శాఖ ఆధ్వర్యంలో సోషల్ మీడియా సంగమం ప్రోగ్రాం ఆదివారం నిర్వహించారు. ఇక్కడ భారతీయ సమాజంలో స్త్రీ అనే అంశంపై నవత మాట్లాడుతూ, ఆడవారిని గౌరవించే సుసాంప్రదాయం కేవలం హిందూ ధర్మంలోనే ఉందని, భారతీయ మహిళలు ప్రపంచంలోని అన్ని సాంప్రదాయాల్లోని మహిళల కన్నా ఆదర్శవంతమైనవారని చెప్పారు. ఇక్కడ సమాచార భారతి సంయుక్త కార్యదర్శి ప్రదీప్ కుమార్, తడిగొప్పుల శంకరయ్య, పురాణం రాము, గీకూరి శ్రీనివాస్, సామల కిరణ్, కట్టా వేణుగోపాల్, సత్యనారాయణ, విమల్, బాలరాజు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

తెలంగాణచౌక్, మార్చి 9 : ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్ మాదిగ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ చేయకుండా ఉద్యోగల నోటిఫికేషన్ ఫలితాలను నిలిపేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా కలెక్టరేట్ ఎదుట నిరవధిక దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత కల్పించకుండా రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాలను భర్తీ చేయాలని కుట్రలు చేస్తుందని ఆరోపించారు. సుప్రీం కోర్టు తీర్పులను అమలు చేయకుండా కమిటీలు, కమిషన్ల పేరుతో సీఎం రేవంత్‌రెడ్డి మాదిగలకు అన్యాయం చేస్తున్నాడని మండిపడ్డారు. రాజకీయ ఓటు బ్యాంకుగా మాదిగలను కాంగ్రెస్ వాడుకుంటుందన్నారు. ఉద్యోగాల భర్తీలను నిలిపివేసి వర్గీకరణ తర్వతనే ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు. కమిషన్ లోపాలను సవరించాలని డిమాండ్ చేస్తున్న ప్రభుత్వం పెడచెవిన పెడుతుందని విమర్శించారు. ఉద్యోగల నోటిఫికేషన్ ఫలితాలను విడుదల చేస్తూ మరో ఉద్యమం చూడాలసి ఉంటుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. నిరవధిక దీక్ష శిబిరంలో ఎమ్మార్పీఎస్ నాయకులు రుద్రారపు రాంచందర్, అంజయ్య, మల్లయ్య, ఆంజనేయులు, సంపత్ పాల్గొన్నారు.

మహానీయుల ముసుగులు తొలగేనా !

- ఆర్టీసీ స్థలం అంటూ అధికారుల అడ్డగింత
- రెండేండ్ల నుంచి ముసుగులోనే..
- సోమవారం నుంచి రిలే నిరాహార దీక్షలకు దిగనున్న జేఏసీ

ముసుగులో ఉన్న మహానీయుల విగ్రహాలు

తిమ్మాపూర్, మార్చి 9 : తరాలు మారుతున్నా కొద్దీ కొత్త తరాలకు గొప్ప వారి జీవితాలు, వారి త్యాగాలు, వారు చేసిన పనులు ఆదర్శంగా నిలవాలనే ఉద్దేశ్యంతో వారి అభిమానులు, సంఘాల ఆధ్వర్యంలో మహానీయుల విగ్రహాలు ప్రతిష్టిస్తారు. కానీ, తిమ్మాపూర్‌లో ఏర్పాటు చేసి ప్రతిష్ఠించడానికి సిద్ధంగా ఉన్న మహానీయుల విగ్రహాలు ఆర్టీసీ వర్సెస్ విగ్రహాల ఆవిష్కరణ జేఏసీ మధ్య ముసుగులు తొడిగే ఉండిపోతున్నాయి. ఈ క్రమంలో అధికారుల తీరుతో విసిగిపోయిన జేఏసీ నాయకులు సోమవారం నుంచి రిలే నిరాహారదీక్షలకు దిగనున్నట్లు ప్రకటించారు.

ప్రస్తుత పరిస్థితుల్లో విగ్రహాల ఏర్పాటు ఖర్చుతో కూడుకున్నది. కానీ, రెండేండ్ల కింద మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ సహకారంతో దళిత సంఘాల ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదుట ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలను ఏర్పాటు చేశారు. మరో రెండు రోజుల్లో ఆవిష్కరణ జరగబోతుండగా ఆర్టీసీ చైర్మన్ సజ్జనార్ ఆదేశాలతో ఆ విగ్రహాలు ఏర్పాటు చేసిన స్థలం ఆర్టీసీదంటూ నిలిపేశారు. అప్పటి నుంచి మధ్య మధ్యలో రెండు, మూడు సార్లు దళిత సంఘాల నాయకులు ఆవిష్కరించేందుకు ప్రయత్నించి నప్పటికీ ఆర్టీసీ బలగాలు, స్థానిక పోలీసులు భగ్నం చేశారు. ఇటీవల కొన్ని రోజుల కింద ఏకంగా విగ్రహాల ఆవిష్కరణ కోసం మండలంలోని అన్ని పార్టీలు, సంఘాల ఆధ్వర్యంలో జేఏసీని ఏర్పాటు చేశారు. పలు దఫాలుగా అధికారులు, ప్రజాప్రతినిధులను, రాష్ట్ర స్థాయిలో అధికారులను ఈ జేఏసీ నాయకులు కలిసినా ఫలితం లేకపోవడంతో సోమవారం నుంచి రిలే నిరాహార దీక్షలకు దిగనున్నట్లు ప్రకటించారు.

ఆవిష్కరణ జరిగేదాక దీక్షలు..

రెండేళ్ల నుంచి ఆవిష్కరణ కోసం వినతులు ఇస్తూ వస్తున్న జేఏసీ కమిటీ కన్వీనర్లు దుండ్ర రాజయ్య, మాతంగి శంకర్, సుగుర్తి జగదీశ్వరాచారి, వంతడుపుతల సంపత్, నాయకులు ఈ సారి గట్టిగా ప్రయత్నిస్తున్నారు. ఆవిష్కరణ జరిగేదాక దీక్షలు కొనసాగిస్తామని స్పష్టం చేస్తున్నారు. దీక్షల కోసం తహసీల్దార్, పోలీసులకు ముందస్తు సమాచారం ఇచ్చి అనుమతులు ఇవ్వాలని కోరారు. వీరి దీక్షకు దిగి వచ్చి సర్కారు ఆవిష్కరణకు అవకాశం ఇస్తుందా.? దీక్షను అడ్డుకుంటుందా.? అనేది వేచిచూడాలి.

అట్రాసిటి కేసు నమోదు చేయాలి

తెలంగాణచౌక్, మార్చి 9 : నగరం పాలక సంస్థ ఈఈ యాదగిరి మీద దాడి చేసిన కాంట్రాక్టర్లపై ఎస్సీ,ఎస్టీ కేసు నమోదు చేయాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి శివరాజ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని ఆ పార్టీ కార్యాలయంలో అదివారం నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, విధి నిర్వహణలో ఉన్న దళిత అధికారిమీద దాడి చేసి, అమానించిన వారిపై చర్యలు ఎందుకు తీసుకోవడంలేదో ఉన్నతాధికారులు సమాధానం చెప్పాలన్నారు. దళిత ఉద్యోగులకు రక్షణ కల్పించాలన్నారు. చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం చేస్తే జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లా ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేస్తే చర్యలు

**వర్క